సాక్షి
నంద్యాల
మంగళవారం । 22 । జూలై । 2025



వేతనాలు ఆలస్యమే!
ప్రభుత్వ ఉద్యోగులకు జూలై నెల వేతనాలు ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. వివిధ అంశాలకు సంబంధించి తాజా సమాచారాన్ని అప్‌డేట్ చేయడంలో సమస్యలు వస్తున్నాయి. 10లో▸



కన్నీటి సాగు
ఖరీఫ్ ప్రారంభంలోనే రైతులు కన్నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. అరకొర వర్షాలతో విత్తు నాటేందుకు కుటుంబసభ్యులు, కూలీలతో కలసి గుంతలు తీసి, నీరుపోవాల్సి వస్తోంది. 10లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,625.96
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:79.665
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:36,813
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:39,228

న్యూస్‌రీల్

రాజకీయ కక్షతోనే ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్



జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: రాజకీయ కక్షతోనే వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డిని కూటమి ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేయించిందని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆరోపించారు. సోమవారం కొలిమిగుండ్లలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. డిస్టరీల నుంచి మద్యం నేరుగా ప్రభుత్వం కొనుగోలు చేశాక అక్కడి నుంచి షాపులకు చేరుతుందని, ఇందులో అవినీతి చేసేందుకు ఎటువంటి అవకాశం లేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో సర్కార్ మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడంతో ప్రభుత్వ ఆదాయం కూడా పెరిగిందన్నారు. మిథున్‌రెడ్డి కుటుంబం రాజకీయంగా మంచి పేరు తెచ్చుకోవడంతో పాటు వైఎస్సార్‌సీపీలో బలంగా ఉందనే దురుద్దేశంతోనే అక్రమంగా అరెస్ట్ చేశారన్నారు. ఎంపీ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. లోకసభ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న ఆయన్ను అక్రమంగా కేసులో ఇరికించడం మంచి సంప్రదాయం కాదన్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం

నంద్యాల(అర్బన్): జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు ఒక మోస్తరు వర్షం కురిసింది. నంద్యాల రూరల్ మండలం 70.4, వెలుగోడు 69.6, మహానంది, కొత్తపల్లి 68.2, రుద్రవరం 65.0, నందికొట్కూరు 62.4, జూపాడుబంగ్లా 61.2, నంద్యాల అర్బన్ 60, గడివేములలో 50.2 మి.మీ వర్షం కురిసింది. అలాగే పాములపాడు 48.6, శిరివెళ్ల 42.2, ఆత్మకూరు 38.6, మిడుతూరు 34.6, పాణ్యం, శ్రీశైలం 28.2, బండిఆత్మకూరు 25.2, గోస్పాడు 15.2, ఆళ్లగడ్డ 13.2, బనగానపల్లె 12.4, బేతంచెర్ల, అవుకులో 10.2 మి.మీ వర్షం కురిసింది.

స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా శ్రీనివాసరెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసరెడ్డి

నంద్యాల: జిల్లా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా పి.శ్రీనివాసరెడ్డి సోమవారం తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా డీజీపీ హెడ్‌క్వార్టర్‌లో పని చేస్తున్న ఈయన నంద్యాల స్పెషల్ బ్రాంచ్(ఎస్‌బీ) డీఎస్పీగా బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం మర్యాదపూర్వకంగా ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణాను కలిశారు.

రికార్డుల నిర్వహణపై కేంద్ర బృందం ఆగ్రహం

ఉయ్యాలవాడ: పొదుపులక్ష్మి గ్రూపుల సభ్యులకు సంబంధించిన లావాదేవీల వివరాల రికార్డుల నిర్వహణపై అధికారుల పనితీరుపై కేంద్రం బృందం కమిటీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని ఆర్.పాంపల్లె గ్రామంలో సోమవారం కేంద్ర బృందం సభ్యులు పర్యటించారు. గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులు, ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులు, గృహ నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయంలో గ్రామ సభ నిర్వహించారు. అంతకు ముందు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కుందరు వాగుపై నిర్మించిన వంతెనను పరిశీలించారు.

కుట్టు శిక్షణ.. మిషన్లకు నిరీక్షణ!



గోనెగండ్లలో సోమవారం కుట్టు మిషన్లు ఇవ్వాలని ఆందోళన చేస్తున్న మహిళలు

ట్రైనర్, డిజిటల్ అసిస్టెంట్లకు అందని వేతనాలు

- ➡ ఉమ్మడి జిల్లాలోని 47 కేంద్రాల్లో శిక్షణ పొందే మహిళలకు కుట్టు శిక్షణ నేర్పించేందుకు ఒక ట్రైనర్, వారి హాజరును ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఒక డిజిటల్ అసిస్టెంట్‌ను ఏర్పాటు చేశారు.
- ➡ వీరికి ఒక్కొక్కరికి నెలకు రూ.10 వేల వేతనం అందించాలని నిర్ణయించారు.
- ➡ అయితే వీరికి విధుల్లో చేరినప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు మూడు నెలలుగా నయాపైసా వేతనం కూడా అందించని పరిస్థితి.
- ➡ ఈ పథకం నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం వల్ల వీరికి వేతనాలను అందించలేకపోతున్నట్లు సమాచారం.
- ➡ ఇప్పటికే ఆయా కేంద్రాల్లో శిక్షణ పూర్తి చేసిన వారు వేతనాల కోసం ఎదురు చూస్తున్నారు.

ప్రహసనంగా ఉచిత కుట్టు శిక్షణ

- మిషన్లు ఎప్పుడిస్తారని మహిళల ఆందోళన
- ఈ నెల 29వ తేది వరకు శిక్షణ ఉందని అధికారుల బుకాయింపు
- పొంతనలేని సమాధానాలతో మహిళల బేజారు
- ట్రైనర్, డిజిటల్ అసిస్టెంట్లకు నేటికీ అందని వేతనాలు
- ఉమ్మడి జిల్లాలో 47 కేంద్రాల్లో 6,132 మందికి శిక్షణనిచ్చినట్లు హాజరు

కర్నూలు(అర్బన్): గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని బీసీ, ఈబీసీ తదితర సామాజిక వర్గాలకు చెందిన మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఉద్దేశించిన ఉచిత కుట్టు శిక్షణ ప్రహసనంగా మారింది. ఈ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్‌తో పాటు ఉచితంగా కుట్టు మిషన్‌ను అందిస్తామని ప్రభుత్వం భారీగా ప్రచారాలు నిర్వహించింది. ఈ నేపథ్యంలోనే ఉమ్మడి కర్నూలు జిల్లాలోని బీసీ, ఈబీసీ కులాలతో పాటు కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, కాపు (బలిజ) కులాలకు చెందిన వేల మంది మహిళలు ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలకు వెళ్లి శిక్షణ పూర్తి చేసుకున్నారు. మొత్తం 360 గంటలు శిక్షణ తీసుకోవాలని నిర్ణయించారు. 45 రోజుల్లో శిక్షణ పూర్తి కావాలంటే రోజుకు 8 గంటలు, 60 రోజుల్లో అయితే రోజుకు 6 గంటలు, 90 రోజుల్లో శిక్షణ తీసుకోవాలనుకునే వారు రోజుకు 4 గంటల పాటు శిక్షణ పొందాల్సి ఉంది. మొత్తంగా 360 గంటలు శిక్షణ పూర్తయిన వారికి సర్టిఫికెట్, ఉచితంగా కుట్టు మిషన్ అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఏడాది ఏప్రిల్ 15వ తేది నుంచి శిక్షణా కార్యక్రమాలు కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 15వ తేది నుంచి లెక్క వేసుకుంటే ఇప్పటికే తమ శిక్షణ కాలం (90 రోజులు) పూర్తయిందని మహిళలు చెబుతున్నారు. సెలవు దినాలను మినహాయించి 90 రోజులు శిక్షణ తీసుకోవాల్సి ఉంటుందని నిర్వాహకులు చెబుతున్నారు. శిక్షణ తీసుకున్న గంటలను పరిగణనలోకి తీసుకుంటారా? లేక 90 రోజులను లెక్కలోకి తీసుకుంటారా ? అనే విషయంలో సందిగ్ధత నెలకొంది. పైగా శిక్షణలో 75 శాతం హాజరు ఉంటేనే సర్టిఫికెట్, కుట్టు మిషన్‌ను అందిస్తామన్నారు. అయితే పలువురు మహిళలు వివిధ కారణాల వల్ల గైర్హాజరైన వారికి హాజరు నమోదులో భాగంగా శిక్షణను కొనసాగిస్తున్నారు.

శిక్షణ పూర్తయినా మిషన్ ఇవ్వలేదు



నేను ఇంటర్ వరకు చదివాను. కుట్టు మిషన్ ద్వారా కొత్త డిజైన్లు నేర్చుకోవాలని మా గ్రామం నుంచి రోజు ఉదయం గోనెగండ్లకు వచ్చి డిజైన్లు నేర్చుకున్నా. ఇప్పటికే 90 రోజుల శిక్షణ పూర్తయింది. ఇంకా ఉచితంగా కుట్టు మిషన్ ఇవ్వలేదు. మరో నెల రోజులు రావాలంటున్నారు. నేను రోజు వచ్చి వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉంది.

– కవిత, హెచ్. కైరవాడి గ్రామం



ఆలూరు శిక్షణ కేంద్రంలో గైర్హాజరైన వారికి శిక్షణ ఇస్తున్న దృశ్యం

శిక్షణ పొందిన మహిళల ఆందోళన

పలు ప్రాంతాల్లో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు తమకు కుట్టు మిషన్లు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నిస్తూ ఆందోళన చేస్తున్నారు. కుట్టు శిక్షణ తీసుకుంటే తమకు ఉపాధి లభిస్తుందనే ఆశతో ప్రతి రోజు క్రమం తప్పకుండా కేంద్రానికి వెళ్లి శిక్షణ తీసుకున్నామంటున్నారు. 90 రోజులు పూర్తయినా, ఇంకా 10 రోజులు రావాలంటున్నారని వారు వాపోతున్నారు. ఎలాంటి ఇతర పనులకు వెళ్లకుండా శిక్షణ పూర్తి చేసుకున్న తమకు సర్టిఫికెట్, కుట్టు మిషన్లు అందించాలని నిలదీస్తున్నారు.

47 కేంద్రాల్లో శిక్షణ ప్రారంభం

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 47 మండల కేంద్రాల్లో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలు ప్రారంభమయ్యాయి. కర్నూలు జిల్లాలోని 24 కేంద్రాల్లో 3,440 మంది మహిళలకు శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటి వరకు 3,108 మందికి శిక్షణ ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. అలాగే నంద్యాల జిల్లాలోని 23 కేంద్రాల్లో 3,440 మంది లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 3,024 మందికి శిక్షణ ఇస్తున్నట్లు అధికారులు స్పష్టం చేస్తున్నారు. శిక్షణ పొందే ఒక్కో మహిళకు ప్రభుత్వం రూ.21,990 (కుట్టు మిషన్‌తో పాటు) వెచ్చిస్తున్నట్లు అధికారుల ద్వారా తెలుస్తోంది. ఇందులోనే పలు ప్రాంతాల్లో ప్రైవేటు భవనాల్లో ఏర్పాటు చేసిన శిక్షణా కేంద్రాల అద్దె, ఇతరత్రా ఖర్చులన్నీ భరించాలని సూచించడం గమనార్హం.

ఈ నెలాఖరుకు శిక్షణ పూర్తి



ఉచిత కుట్టు శిక్షణ ఈ నెల 29వ తేదితో ముగుస్తుంది. ప్రభుత్వ సెలవు దినాలను పరిగణనలోకి తీసుకోరాదు. ఏప్రిల్ 15న ఈ పథకం జిల్లాలో లాంఛనంగా ప్రారంభించాం. పలు ప్రాంతాల్లో వివిధ కారణాల వల్ల ఏప్రిల్ నెలాఖరు వరకు కూడా ప్రారంభాలు జరిగాయి. గైర్హాజరైన వారికి ఆయా కేంద్రాల్లో శిక్షణ ఇంకా కొనసాగుతోంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్టిఫికెట్లు, కుట్టు మిషన్ల పంపిణీపై చర్యలు తీసుకుంటాం.

– జాకీర్‌హుసేన్, ఈడీ, బీసీ కార్పొరేషన్

చెరువులు కాదు రోడ్లే!



మిక్కినేనిపల్లె గ్రామంలో ప్రధాన రోడ్డు

మంచి రోడ్లు వేస్తామని, గుంతలు లేని రాష్ట్రం చేస్తామని ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక రోడ్ల గురించే మరచిపోయారు. వర్షాలతో రోడ్లన్నీ చెరువులను తలిపిస్తున్నా పట్టించుకోవడం లేదు. రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా.. వాహనాలపై వెళ్లలేక కింద పడి కొందరు గాయాలపాలవుతున్నా.. ఒకరిద్దరు మృత్యువాత పడుతున్నా 'కూటమి' ప్రభుత్వంలో చలనం లేదు. సంజామల మండలం మిక్కినేనిపల్లె గ్రామంలో ప్రధాన రోడ్డు చెరువును తలపిస్తూ సోమవారం కనిపించింది. బస్టాండ్ దగ్గర మోకాళ్లలోతు గుంతలతో వాహనాదారులు సతమతం అవుతున్నారు. రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రిగా బనగానపల్లె ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి ఉన్నారు. అధ్వాన రోడ్లతో నియోజకవర్గ ప్రజలు తీవ్ర కష్టాలు పడుతున్నా మంత్రి పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. – సంజామల



చూడకుండా వెళితే గుంతలో గల్లంతు కావాల్సిందే!



అధ్వానంగా గిద్దలూరుకు వెళ్లే దారి

భూ రీసర్వే సమస్యలపై ప్రత్యేక దృష్టి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



వినతులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: భూ రీసర్వే సమస్యలపై ఎక్కువ అర్జీలు వస్తున్నాయని, ఆర్డీఓలు, తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించి వాటిని పరిష్కారించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా పరిష్కార వేదికకు వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. ఆర్డీఓలు ప్రతి రోజూ తహసీల్దార్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏ వెళ్లకుండా చూడాలన్నారు. ప్రజా పరిష్కార వేదికకు వచ్చే విభిన్న ప్రతిభావంతుల కోసం ముగ్గురు సహాయకులను ఏర్పాటు చేస్తామని చెప్పారు. జిల్లా వివిధ ప్రాంతాల నుంచి 168 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్‌కు వినతులు అందజేశారు.

మోసం చేశారు.. న్యాయం చేయండి!

- ఎస్పీకి ఫిర్యాదులు ఇచ్చిన ప్రజలు



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ

నంద్యాల: వివిధ రకాల ఆశలు చూపి డబ్బు తీసుకుని మోసం చేశారని, వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణాకు ప్రజలు ఫిర్యాదులు అందించారు. ఎస్పీ కార్యాలయంలో సోమవారంప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కొండమాయపల్లె గ్రామ ప్రెసిడెంట్, బొజ్జయ్య అనే వ్యక్తులు మూడు నెలల క్రితం 96 బస్తాల వరి ధాన్యాన్ని కొని ఇంతవరకు డబ్బు ఇవ్వడం లేదని గోస్పాడు మండలం జూలపల్లి గ్రామానికి చెందిన జబ్బార్ ఫిర్యాదు చేశారు. ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి సీపీఆర్ షేక్ వహిదా రూ.8లక్షలు తీసుకుని మోసం చేశారని శిరివెళ్లకు చెందిన పఠాన్‌ఖాన్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. వీటితోపాటు పొలం తగాదాలు, అన్నదమ్ముల ఆస్తి తగాదాలు తదితర 130 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని, పునరావృతం కాకుండా చూడాలని ఫోన్‌లో పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు.


యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు



యూరియా కోసం ధర్నా చేస్తున్న రైతులు

నందికొట్కూరు: యూరియా కోసం రైతులు సోమవారం రోడ్డెక్కారు. నందికొట్కూరు పట్టణంలోని మార్కెట్ యార్డు ఎదుట కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిపై ధర్నా చేశారు. మార్కెట్ యార్డులో ఉన్న రైతుసేవా కేంద్రం వద్దకు వారం రోజుల నుంచి వస్తున్నా ఒక్క బస్తా యూరియా కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులకు యూరియా లారీలను పంపిస్తున్నారని ఆరోపించారు. యూరియా దొరకక సన్న, చిన్నకారు రైతులు ఇబ్బంది పడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. యూరియా వేయకపోవడంతో మొక్కజొన్న, మిరప, పత్తి పైర్లు దెబ్బతింటున్నాయని, రైతులు పరిస్థితిని అర్థం చేసుకోవాలన్నారు. యూరియా సంచులు ఇచ్చే వరకు ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

మళ్లీ తెరచుకోనున్న శ్రీశైలం డ్యాం గేట్లు



శ్రీశైలం డ్యాం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రాజెక్ట్ రేడియల్ క్రస్ట్ గేట్లను మంగళవారం మరోమారు తెరువనున్నారు. జలాశయానికి ఎగువ పరీవాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం పెరుగుతుండడం, ఇప్పటికే డ్యాం నీటిమట్టం 883.40 అడుగులకు చేరుకోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆదివారం నుంచి సోమవారం వరకు జూరాల, సుంకేసుల నుంచి 1,27,201 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. దిగువ ప్రాజెక్టులకు 89,873 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డ్యాం పరిసర ప్రాంతాల్లో 27 మి.మీ వర్షం కురిసింది. కుడిగట్టు కేంద్రంలో 17.287, ఎడమగట్టు కేంద్రంలో 17.585 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. సోమవారం సాయంత్రం సమయానికి జలాశయంలో 206.9734 టీఎంసీల నీరు ఉంది.

శ్రీశైలంలో అక్రమాలకు చెక్ పడేనా?

- దేవస్థాన ఉద్యోగులతోనే విజిలెన్స్ కమిటీ
- టికెట్ల కుంభకోణాలు ఆగేనా?



శ్రీశైలంటెంపుల్: మహాక్షేత్రమైన శ్రీశైలంలో ఒకటి కాదు, రెండు కాదు.. వందలాది అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. వీటన్నింటికీ చెక్ పెట్టేందుకు శ్రీశైల దేవస్థాన ఈఓ మొట్టమొదటిసారిగా అధికారుల బృందంతో నూతనంగా విజిలెన్స్ కమిటీని ఏర్పాటు చేశారు. అయితే ఈ విజిలెన్స్ కమిటీ ఏర్పాటుతోనైనా దేవస్థానంలో కుంభకోణాలకు చెక్ పడుతుందో లేదో వేచిచూడాలి. నూతనంగా ఏర్పాటు చేసిన విజిలెన్స్ కమిటీలో దేవస్థాన ఉద్యోగులు నలుగురు ఉన్నారు. ప్రస్తుత విధులతో వారు సతమతమవుతున్నారు. ఇక విజిలెన్స్ బృందంలో పనిచేస్తూ ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం పనిభారమనే విమర్శలు వినిపిస్తున్నాయి. దేవస్థానానికి ఎటువంటి సంబంధం లేని అధికారుల బృందంతో ప్రత్యేకంగా విజిలెన్స్ కమిటీని ఏర్పాటు చేస్తే ఉపయోగం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

శ్రీశైలంలో చోటుచేసుకున్న కుంభకోణాలు ఇవీ..

- ➡ లడ్డూ ప్రసాదాల విక్రయాల్లో గోల్‌మాల్ జరిగింది.
- ➡ రూ.150టికెట్ల రీసైక్లింగ్, అభిషేకం టికెట్ల అక్రమాలు జరిగాయి.
- ➡ రికార్డు అసిస్టెంట్ రికార్డులను తారుమారు చేసి రూ.3.5లక్షలు తన జేబులోకి వేసుకున్నారు.
- ➡ పెట్రోల్‌బంక్‌లో భారీ కుంభకోణం జరిగింది. దేవస్థాన ఖాతాలో డబ్బులు జమ చేయకుండా ఏకంగా రూ.41లక్షలు మల్లన్న సొమ్మును స్వాహా చేశారు.
- ➡ డొనేషన్ కౌంటర్‌లో రూ.14లక్షల అవినీతి స్కాం బయటపడింది.
- ➡ ఇటీవల మల్లన్న స్పర్శదర్శనం టికెట్ల మార్ఫింగ్ చేసి భక్తులకు విక్రయించిన ఘటనలో కేసు నమోదు చేశారు.
- ➡ మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం చేయిస్తానని భక్తుల దగ్గర నుంచి రూ.15వేలు వసూలు చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.
- ➡ రెండు సార్లు గర్భగుడిలో హుండీల దొంగతనం చోటుచేసుకుంది.

ఇదీ దుస్థితి..

శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి దర్శనానికి ప్రతి రోజూ వేలాది మంది భక్తులు తరలివస్తారు. మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం చేసుకునేందుకు అధికసంఖ్యలో భక్తులు ఆసక్తి చూపుతారు. ఈ సేవ తరువాత మల్లన్నకు స్పర్శదర్శనం చేసుకునేందుకు భక్తులు ఆరాటపడతారు. అయితే క్షేత్రంలో ఆయా ఆర్జితసేవల టికెట్లు అన్నీ ఆన్‌లైన్ ద్వారానే తీసుకోవాల్సిన పరిస్థితి. అలాగే క్షేత్రంలో వసతి గదులు పొందేందుకు, ఆర్జిత సేవ, స్పర్శదర్శనం టికెట్ల కోసం మధ్యవర్తులపై ఆధారపడుతున్నారు. భక్తుల అవసరాలను ఆసరాగా చేసుకుని క్షేత్రంలో కొందరు దళారుల అవతారం ఎత్తారు. భక్తుల నుంచి అధికంగా డబ్బులు వసూలు చేస్తు మోసం చేస్తున్నారు.

విజిలెన్స్ కమిటీ ఎందుకంటే..

శ్రీశైల మహాక్షేత్రంలో ఇటీవల చోటుచేసుకున్న కొన్ని పరిణామాల దృష్ట్యా భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. దేవస్థానం ప్రయోజనాలు, దేవస్థాన ప్రతిష్టతకు భంగం కలిగింది. దీంతో మోసపూరిత చర్యలపై నిఘా ఉంచడానికి, దేవస్థాన ప్రతిష్టతకు భంగం కలిగించే , హాని కలిగించే అంశాలను నివారించడానికి విజిలెన్స్ బృందాన్ని ఏర్పాటు చేశారు. విజిలెన్స్ బృందానికి జాబ్ చార్ట్‌ను కూడా దేవస్థానం ఈఓ ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రెండు ప్రధానాలయాల్లో ప్రత్యేక నిఘా, ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం వీరి విధి. అలాగే ఏదైనా తప్పు చోటుచేసుకున్నట్లు రుజువైతే, ఉద్యోగి అవినీతి చేస్తే అవసరమైన కఠిన చర్యలు తీసుకునేందుకు దేవస్థాన ఈఓకు వీరు నివేదిక ఇవ్వాలి.

నకిలీ పాసుపుస్తకాల కుంభకోణం

- లేని భూములు ఉన్నట్లు ఆన్‌లైన్‌లో రికార్డు
- బ్యాంకుల వద్ద రూ. 80 లక్షల రుణాలు
- ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు



అరెస్ట్ చేసిన నిందితులను చూపిస్తున్న ఆళ్లగడ్డ డీఎస్పీ



పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ పాసుపుస్తకాలు, టైటిల్ డీడ్స్

కోవెలకుంట్ల: కొత్త సర్వేనంబర్లతో లేని భూమిని ఉన్నట్లు సృష్టించి నకిలీ పాసుపుస్తకాలను డబ్బులకు విక్రయించి అమాయక ప్రజలను ఘరానా మోసం చేశారు. ఈ కేసును పోలీసులు ఛేదించారు. కోవెలకుంట్ల పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ తెలిపిన వివరాల మేరకు.. 2018లో సంజామల మండల తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న బషీర్ అహ్మద్, ఇదే గ్రామానికి చెందిన ఉపేంద్ర, ఈపూరి ప్రసాద్, గడివేములకు చెందిన దూదేకుల మమహ్మద్ రఫీ, దూదేకుల పెద్ద జమాల్‌బాషా, కర్నూలుకు చెందిన అబ్దుల్ సత్తార్, కోవెలకుంట్ల మండలం కంపమల్లకు చెందిన వరప్రసాద్ ముఠాగా ఏర్పడి నకిలీ పాసుపుస్తకాల కుంభకోణం చేశారు. సంజామల మండలంలోని పేరుసోముల, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, ముదిగేడు ప్రాంతాల్లో ఆరు కొత్త సర్వేనంబర్లను సృష్టించి 321.83 ఎకరాల భూమి లేకున్నా ఉన్నట్లు చూపించి అమాయక ప్రజలకు నకిలీ పాసుపుస్తకాలు విక్రయించారు. సంజామల, కోవెలకుంట్ల, గడివేముల, నందికొట్కూరు, కర్నూలు ప్రాంతాలకు చెందిన 67 మందితో ఒక్కొక్కరి వద్ద నుంచి రూ. 30 వేలు నగదు తీసుకుని భూములను ఆన్‌లైన్ ఎక్కించినట్లు నమ్మబలికించారు. ఇందులో 55 మందికి నకిలీ పట్టాదారు పాసుపుస్తకాలు, టైటిల్‌డీడ్స్ అందజేశారు. 49 మంది వివిధ బ్యాంకుల్లో పాసుపుస్తకాలను తనఖా పెట్టి రూ. 80 లక్షల పంట రుణాలు తీసుకున్నారు. 2023లో అక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ మల్లికార్జునరావు నకిలీ ఆన్‌లైన్‌భూముల వ్యవహారంపై సంజామల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు భూ కుంభకోణాన్ని వెలికితీశారు. ఈ కేసులో ప్రధాన నిందితులైన ఉపేంద్ర, ఈపూరి ప్రసాద్, దూదేకుల మహమ్మద్ రఫీని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 12 నకిలీ పట్టాదారు పాసుపుస్తకాలు, ఐదు టైటిల్ డీడ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా ఉన్న కంప్యూటర్ ఆపరేటర్ బషీర్ అహ్మద్ కొంత కాలం క్రితం మృతి చెందాడు. కేసులో మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉండగా వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పాసుపుస్తకాల జారీకి రెవెన్యూ సిబ్బంది, అధికారులు సర్టిఫై చేసినట్లు పాసుపుస్తకాలు జారీ చేశారు. ఈ వ్యవహారంపై రెవెన్యూ సిబ్బంది ప్రమేయం ఉందా, వారి సంతకాలు, ఆన్‌లైన్ రికార్డులను తారుమారు చేశారా అన్న కోణాల్లో పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. నకిలీ పాసుపుస్తకాలు తనఖా పెట్టి బ్యాంకు రుణాలు పొందిన వ్యక్తులు త్వరితగతిన తీసుకున్న రుణాన్ని చెల్లించకపోతే వాని కూడా ఈ కేసులో చేర్చాల్సి ఉంటుందని డీఎస్పీ హెచ్చరించారు. అరెస్ట్ చేసిన నిందితులను కోర్టులో హాజరు పరుచుగా మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు. నకిలీ పాసుపుస్తకాల కేసును ఛేదించిన కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్, సంజామల, కోవెలకుంట్ల ఎస్ఐలు రమణయ్య, మల్లికార్జునరెడ్డి, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ప్యాపిలి: మండల కేంద్రంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్యాపిలికి చెందిన అంకాలప్ప గారి ప్రసాద్ (35) మృతి చెందాడు. అనంతపురం జిల్లా గుత్తి నుంచి డోన్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ప్రసాద్ తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సుధాకర్ అనే వ్యక్తికి కాలు విరగడంతో చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు ప్రసాద్‌కు భార్య లత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అప్పటి వరకు మొహర్రం వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్న ప్రసాద్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో స్థానికంగా విషాదం నెలకొంది. ప్యాపిలి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


మృతి చెందిన రైతు వెంకటరెడ్డి

అవుకు: మొక్కజొన్న పంటకు నీళ్లు కట్టేందుకు వెళ్లిన రైతును కరెంట్ కాటేసింది. చనుగొండ్ల గ్రామంలో విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా.. చనుగొండ్ల గ్రామానికి చెందిన బాచం వెంకట రెడ్డి(72) తాను సాగు చేసిన మొక్కజొన్న పంటకు నీళ్లు కట్టేందుకు ఆదివారం రాత్రి పొలానికి వెళ్లాడు. నీళ్లు కట్టడం కోసం మోటర్ స్విచ్‌ను ఆన్ చేయడానికి స్టార్టర్ బాక్స్‌ను తెరిచాడు. అయితే అంతకు ముందే వర్షం కురవడంతో స్టార్టర్ బాక్స్ తడిచిపోవడం, బాక్స్‌లో వైర్లు తెగిపోయి ఉండటంతో స్టార్టర్ బాక్స్‌కు విద్యుత్ సరఫరా అయ్యింది. ఈ విషయం తెలియక రైతు స్టార్టర్ బాక్స్‌ను తెరిచే ప్రయత్నం చేయగా షాక్‌కు గురై మృతి చెందాడు. మృతుడి కుమారుడు బాచం మధుసుధాకర్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజారెడ్డి సోమవారం తెలిపారు.

చుక్కలదుప్పిని కాపాడిన అటవీ సిబ్బంది


అడవిలోకి వెళ్తున్న జింక

మహానంది: నల్లమల అడవి సమీపంలోని తెలుగుగంగ కాలువలో నీటి ఉద్ధృతికి ఓ చుక్కల మగదుప్పి కొట్టుకొచ్చింది. ఆంజనేయ స్వామి కొట్టాల-బసవాపురం గ్రామాల మధ్యలో కాలువలో కంపచెట్లను ఆసరాగా చేసుకుని నిలబడటంతో ప్రాణాపాయం తప్పింది. విషయం తెలుసుకున్న అటవీశాఖ ఎఫ్ఎస్ఓ విజయవర్ధన్, కిషోర్‌కుమార్, ఎఫ్‌బీఓలు నాగప్ప, మద్దిలేటి స్వామి, ప్రొటెక్షన్ వాచర్లు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. చుక్కల దుప్పిని బయటికి తీసి చిన్న చిన్న గాయాలు కావడంతో ప్రథమ చికిత్స చేశారు. కోలుకున్న దుప్పి బతుకు జీవుడా అంటూ అడవిలోకి వదిలేశారు.


దూదేకొండ సమీపంలో కుంటలో నీరు తోడుకుని వస్తున్న రైతు లక్ష్మన్న


పొలంలో గునపంతో గుంతలు తీస్తున్న దృశ్యం

కన్నీటి సాగు

వాన దేవుడు కరుణిస్తాడని.. పుడమి తల్లి ఆశీర్వదిస్తుందనే నమ్మకంతో రెక్కల కష్టాన్ని పెట్టుబడిగా పెట్టి రైతులు కన్నీటి సాగు చేస్తున్నారు. అదను దాటిపోతుందని దేవుడిపై భారం వేసి పాదులు తవ్వి, నీళ్లు పోసి నాట్లు వేస్తున్నారు. ఖరీఫ్ ప్రారంభంలోనే రైతులు కన్నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. అరకొర వర్షాలతో పొలాలు విత్తు నాటేందుకు పదునెక్కడం లేదు. ముందస్తు వర్షాలు రైతులను మురిపించినా ఆతరువాత సరిగ్గా విత్తుకు వానదేవుడు ముఖం చాటేశాడు. సోమవారం దూదేకొండ గ్రామానికి చెందిన ఈరయ్య అనే రైతు తనకున్న రెండెకరాల్లో అతని కుటుంబ సభ్యులు, వ్యవసాయ కూలీలతో గుంతలు తీసి, నీరుపోసి టమాట నారు నాటాడు. సమీపంలో ఉన్న కుంట నుంచి బిందెలతో కొడుకు లక్ష్మన్న నీళ్లు తీసుకురాగా, అతని భార్య గునపంతో గుంతలు తీయగా, కూలీలు టమాటా నారు నాటారు. ఉదయం నుంచి పొద్దుపోయే దాక ఇలా కష్టాల సాగుకు శ్రీకారం చుట్టాడు. వానదేవుడు కరుణించక పోతాడా అని గంపెడంత ఆశతో నాట్లు వేశారు. – పత్తికొండ రూరల్


నీరు పోసి టమాటా నారు నాటుతున్న వ్యవసాయ కూలీలు

జూలై నెల వేతనాలు ఆలస్యమే!

కర్నూలు(అగ్రికల్చర్): ప్రభుత్వ ఉద్యోగులకు జూలై నెల వేతనాలు ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. వివిధ అంశాలకు సంబంధించి తాజా సమాచారాన్ని అప్‌డేట్ చేయాలని ఆర్థిక శాఖ ఆదేశించింది. ఈ ప్రక్రియను పూర్తి చేస్తేనే వేతనాల బిల్లులకు సంబంధించి డాక్యుమెంట్ ఓపెన్ అవుతుంది. జీతాల బిల్లులు అప్‌లోడ్ చేసే సమయంలో దీనిని ఆర్థిక శాఖ బలవంతంగా డీడీవోలపై రుద్దడం వల్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. డ్రాయింగ్ అండ్ డిస్బర్స్‌మెంట్ అధికారుల(డీడీవోలు) దగ్గర ఉన్న కరెంట్, సేవింగ్ బ్యాంకు ఖాతాల వివరాలను అప్‌డేట్ చేయడం, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వివరాలు(ఎంతమంది పొరుగు సేవల ఉద్యోగులు కార్పొరేషన్‌లో పనిచేస్తున్నారు, ఏజెన్సీల ఆధ్వర్యంలో ఎంత మంది ఉన్నారు) అప్‌డేట్ చేయాల్సి ఉంది. ఈ-ఆఫీసు, ఈ-మెయిల్ ఐడీలు జతచేయాల్సి ఉంది. ఉద్యోగులకు సంబంధించిన క్రమశిక్షణా చర్యల వివరాలు, కాంటిన్‌జెంట్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ వివరాలు సీఎఫ్ఎంఎస్‌లో విధిగా చేర్చనున్నారు. రాష్ట్రం మొత్తంగా డీడీవోలు దీనిపైనే దృష్టి సారించడంతో సర్వర్‌పై ఒత్తిడి పెరిగింది. ఈ వివరాలు నమోదు చేయడం పూర్తయిన తర్వాతనే వేతనాల బిల్లులు జనరేట్ కానున్నాయి. సర్వర్‌పై ఒత్తిడి, క్రమశిక్షణా చర్యలకు సంబంధించిన వివరాలు అందుబాటులో లేకపో వడం నమోదు చేయడం ఆలస్యమవుతోందని డీడీవోలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందువల్ల జూలై నెల వేతనాలు ఆలస్యం అయ్యే ప్రమాదం ఉందని అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. ప్రక్రియను ఈ నెల మొదటి వారంలోనే చేపట్టి ఉంటే జీతాల బిల్లులు సకాలంలో ట్రెజరీలకు చేరేవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఉన్నత స్థాయికి చేరుకోవాలి

- మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి

నంద్యాల(అర్బన్): వసతి గృహంలోని బాలికలందరూ బాగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ, వికలాంగ వయోవృద్ధులు, సచివాలయ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు. మంత్రి సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ రాజకుమారితో కలిసి స్థానిక గిరినాథ్ సెంటర్‌లో ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల పోస్ట్ మెట్రిక్ వసతి గృహం 1-2ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలో గదులు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమాన్ని అందిపుచ్చుకొని పేద విద్యార్థులు చదువులో రాణించాలన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పేదల సంక్షేమం, విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాలను అర్హులైన పేద వినియోగం సద్వినియోగం చేసుకోవాన్నారు. అనంతరం వసతి గృహంలోని బాలికలతో కలిసి మంత్రి,, కలెక్టర్ భోజనం చేసి ఆహారం నాణ్యతను స్వయంగా పరిశీలించారు.


విద్యార్థినులతో భోజనం చేస్తున్న మంత్రి, కలెక్టర్

- సోమవారం రాత్రి కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజకుమారి ఆధ్వర్యంలో సాంఘిక సంక్షేమం, విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ, ఈడీ ఎస్సీ కార్పొరేషన్, గ్రామ, వార్డు సచివాలయాల అంశాలపై మంత్రి అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో వేల్పనూరు, వెంకటాపురం, శ్రీశైలం, ఆత్మకూరు, నందికొట్కూర్, డోన్, బనగానపల్లె, నంద్యాల, కోవెలకుంట్ల వసతి గృహాల్లో తక్కువ శాతం అడ్మిషన్లు ఉన్నారని, స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఆర్ఓ రాము నాయక్, నంద్యాల సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చింతామణి, రాధిక, రయిజ్ ఫాతిమా, డీసీఓ శ్రీదేవి, ఖాదర్ బాషా, పాల్గొన్నారు.

కళ్లలో కారం కొట్టి.. కత్తులతో దాడి!

- బెల్ట్ షాప్‌లో వ్యక్తి హత్య కేసులో సంచలన విషయాలు వెలుగులోకి
- హత్యకు స్నేహితులను ఉసిగొల్పిన బెల్ట్‌షాప్ నిర్వాహకుడి కుమారుడు
- ఘటనలో 8 మంది యువకులు పాల్గొన్నట్లు అనుమానం?

పాణ్యం: స్థానిక గోరుకల్లు రస్తాలోని బెల్ట్‌షాప్‌లో ఆదివారం రాత్రి జరిగిన హత్య కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. పాణ్యంలో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న సుబ్బయ్యకు నంద్యాల చెందిన అశోక్‌చౌదరితో పరిచయం ఏర్పడింది. దీంతో అశోక్‌చౌదరి వద్ద నుంచి డబ్బులు ఇతరులకు ఇప్పించి బాండ్లు రాయించేవారు. ఇలా దాదాపుగా రూ. 40 లక్షలకు పైగానే అప్పులు ఇప్పించారు. అయితే తీసుకున్న అప్పు వసూలు చేసేందుకు అశోక్ చౌదరి పలుమార్లు సుబ్బయ్యను అడిగినా ఫలితం లేకపోవడంతో ఆదివారం తప్పకుండా ఇవ్వాలని రెండు రోజుల క్రితం హెచ్చరించాడు. ఈ క్రమంలో అతడిని అంతమొందించాలని సుబ్బయ్య, అతని కుమారుడు సురేష్ కుట్రపన్నినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో సురేష్ తన స్నేహితులకు బెల్ట్‌షాప్‌లో మద్యం తాపించి అశోక్ చౌదరిపై దాడి చేయాలని పథకం రూపొందించినట్లు సమాచారం. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఏడు గంటలకు బెల్ట్ షాప్ వద్దకు వచ్చిన అశోక్‌చౌదరిపై ఒక్కసారిగా అక్కడే ఉన్న యువకులు కళ్లలో కారం కొట్టి కత్తులతో దాడి చేసినట్లు తెలుస్తోంది. అయితే అశోక్ కుమార్ చనిపోయాడని నిర్ధారించుకున్న తర్వాత సుబ్బయ్య, అతని కుమారుడు సురేష్, మరో యువకుడు రమేష్ పోలీసు స్టేషన్‌లో లొంగిపోయినట్లు సమాచారం. కాగా హత్యకు గురైన అశోక్‌చౌదరిపై వివిధ స్టేషన్లలో పదికి పైగా కేసులు నమోదైనట్లు సమాచారం. కాగా హత్యలో పాల్గొన్నట్లు అనుమానిస్తున్న పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

శ్రీశైలంలో భక్తుల రద్దీ


క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. సోమవారం స్వామిఅమ్మవార్లను దర్శించుకునేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు మల్లన్న దర్శనానికి భారీగా తరలివచ్చారు. వేకువజాము నుంచి పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు దర్శనానికి తరలివచ్చారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. మూడు విడతలుగా పలువురు భక్తులు స్పర్శ దర్శనం పొందారు.

ఈ నీళ్లు తాగేదెట్టా?


హెబ్బటం గ్రామంలో వదిలే నీరు రంగు మారిన దృశ్యం

హొళగుంద: రంగుమారిన నీటిని ఎలా తాగాలని హెబ్బటం ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఇటీవల తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ)కి నీటిని విడుదల చేయగా ఆ నీటినే హెబ్బటం మంచినీటి పథకం నుంచి గ్రామాలకు వదులుతున్నారు. ఫిల్టర్ చేయకుండా నేరుగా కుళాయిలకు వదులుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ నీటిని తాగితే అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉందని, తప్పని పరిస్థితిలో మినరల్ వాటరు తాగాల్సి వస్తుందని వాపోతున్నారు. వెంటనే శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నల్లమలలో భారీ వర్షం


ఉద్ధృతంగా ప్రవహిస్తున్న రాళ్ల వాగు

ఆత్మకూరు: ఆత్మకూరు డివిజన్ పరిధిలోని నల్లమలలో సోమవారం వేకువజామున భారీ వర్షం కురిసింది. అల్పపీడన ప్రభావంతో నల్లమల అభయారణ్యంతోపాటు ఆత్మకూరు, సమీప గ్రామాల్లో భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. రెవెన్యూ అధికారుల సమాచారం మేరకు ఆత్మకూరు పట్టణంలో 38.6 మి.మీ. వర్షం కురిసింది. నల్లమలలో అత్యంత ప్రధానమైన రాళ్లవాగు ఒకేరోజు భారీ వర్షాలకు ఉప్పొంగడంతో సిద్ధాపురం చెరువుకు వరద నీరు చేరింది. భవనాశి, సుద్దవాగులో చెక్కునీరు లేక వెలవెలబోతున్న తరుణంలో ఉన్నఫలంగా రాత్రికి రాత్రే వర్షాలు పడడంతో పొంగి పొర్లాయి.

ఆర్మీ జవాన్ల స్థలాలకు రక్షణ లేకపోతే ఎలా?


కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు ఫిర్యాదు చేస్తున్న ఆర్మీ జవాన్ ఏడుకొండలు

కర్నూలు(సెంట్రల్): ' నా పేరు ఎస్ ఏడుకొండలు. నేను ఇండియన్ ఆర్మీలో హవల్దార్‌గా హర్యానాలో పని చేస్తున్నాను. నేను కర్నూలులోని ఉల్చాలరోడ్డులో 2003లో బీఎస్ రెడ్డి అనే బ్రోకర్ నుంచి ఓ వెంచర్‌లో 61 నంబర్ ప్లాటును కొనుగోలు చేసి ఫెన్సింగ్ వేసి విధులకు వెళ్లాను. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ ప్లాటు భద్రంగానే ఉండేదని, అయితే ఇటీవల పక్కన ఉన్న 60వ ప్లాటుదారులు ఆ స్థలం ఫెన్సింగ్‌ను తొలగించి వారిలో ప్లాటులో కలుపుకున్నారని, వారి చెర నుంచి విముక్తి కల్పించాలి' అని కోరుతూ ఆర్మీ జవాన్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశాడు. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని దేశ రక్షణ కోసం తాము అక్కడ పనిచేస్తుంటే..ఇక్కడ తమ స్థలాలకు రక్షణ లేకపోవడం బాధేస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ డాక్టర్ బి.నవ్య ప్రజలనుంచి వినతులను స్వీకరించి వాటికి తగు పరిష్కారాలు చూపాలని అధికారులను ఆదేశించారు.

ఫిర్యాదుల్లో కొన్ని...

- కల్లూరు మండలం ఉలిందకొండ, కొల్లపల్లి తండా, ఎర్రకత్వ గ్రామాలకు కృష్ణకాంత్ స్టోన్ క్రషర్ నుంచి వెలుబడే కాలుష్యం, ఆ కంపెనీ వాహనాలతో పాడైయ్యే రోడ్లు, దెబ్బతినే చెరువు కాల్వలకు రక్షణ కల్పించాలని కోరుతూ ఆయా గ్రామాల ప్రజలు కలెక్టర్‌కు విన్నవించారు.
- తన కుమారుడు పుట్టిన ఐదు నెలల నుంచి లివర్ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతుండడంతో రూ.30 లక్షల వరకు ఖర్చు చేసి చూపించినా బాగు కావడంలేదని, వైద్యం కోసం మరింత ఖర్చు అయ్యే అవకాశం ఉండడంతో ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ వెల్దుర్తికి చెందిన శ్రీరాములు అనే వ్యక్తి కలెక్టర్‌ను అభ్యర్థించాడు.
- కర్నూలులోని గడియారం ఆసుపత్రిలో కుటుంబ శస్త్ర చికిత్సలు చేసేలా చర్యలు తీసుకోవాలని అవాజ్ నగర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పి.ఇక్బాల్‌హుస్సేన్, ఎస్ఎండీ షరీఫ్ కలెక్టర్‌కు విన్నవించారు.

నకిలీ ఆర్‌సీల తయారీ ముఠా గుట్టురట్టు


నకిలీ ఆర్‌సీల తయారీ ముఠా సభ్యులను అరెస్టు చూపి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాబు ప్రసాద్

- రెండు కార్లు, భారీగా నకిలీ ఆర్‌సీలు, పోలీస్ ఎన్‌ఓసీలు స్వాధీనం

కర్నూలు: ఎలక్ట్రానిక్ పరికరాలతో వాహన నకిలీ రికార్డులు, పోలీసు ఎన్‌ఓసీలు, నకిలీ ట్రేడ్ ఐటీఐ సర్టిఫికెట్లు తయారీ చేసి విక్రయించే ముఠా గుట్టురట్టయ్యింది. నంద్యాల పట్టణానికి చెందిన షేక్ సుభాన్, షేక్ షాకీర్, నంద్యాల ఆర్‌టీఓ ఆఫీసులో ఏజెంటుగా పనిచేస్తున్న సుధీర్ బాబు, కర్నూలు పాతబస్తీలోని ఖండేరి వీధిలో ఉన్న ఐటీఐ ఉద్యోగి పెనుగొండ సూరప్ప ముఠాగా ఏర్పడి నకిలీ ఆర్‌సీలు, పోలీస్ ఎన్‌ఓసీలు, ఐటీఐ సర్టిఫికెట్లు తయారు చేసి విక్రయించి సొమ్ము చేసుకునేవారు. ఈనెల 14న అంతర్‌రాష్ట్ర బైక్ దొంగలను మూడో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఏడాది మే 22వ తేదీన కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో ఓ ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూన్ 18న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టగా దొంగల చిట్టా బయటపడటమే కాక తీగ లాగితే డొంక కదిలిన చందంగా చోరీకి గురైన బైకులకు నకిలీ ఆర్‌సీలు తయారు చేసిన ముఠా వివరాలు కూడా బయటపడ్డాయి. ప్రభుత్వాసుపత్రిలో చోరీకి గురైన వాహనానికి సంబంధించిన ఆర్‌సీ కూడా నకిలీదిగా గుర్తించడంతో పాటు తయారీదారులను పోలీసులు గుర్తించి పక్కా ఆధారాలతో నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని మధులోక్ బార్ రెస్టారెంట్ దగ్గర నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించగా వారి నేరాల చిట్టా బయటపడింది. సోమవారం సాయంత్రం మూడో పట్టణ సీఐ శేషయ్యతో కలసి కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్ స్థానిక స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. షేక్ సుభాన్, షేక్ షాకీర్, సుధీర్ బాబు, ఐటీఐ ఉద్యోగి పెనుగొండ సూరప్ప కలసి ముఠాగా ఏర్పడి జిల్లాలోనే కాక ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఢిల్లీ, కేరళ, కర్ణాటక, ఒరిస్సా, గుజరాత్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో కూడా ఆర్‌టీఓ బ్రోకర్ల ద్వారా నకిలీ ఆర్‌సీలు తయారు చేసి విక్రయించినట్లు దర్యాప్తులో వెల్లడయ్యిందని డీఎస్పీ తెలిపారు. వీరి వద్ద భారీగా నకిలీ ఆర్‌సీలతో పాటు పోలీస్ ఎన్‌ఓసీ సర్టిఫికెట్లు, ఐటీఐ సర్టిఫికెట్లు స్వాధీనం చేసుకుని రెండు కార్లు కూడా సీజ్ చేసినట్లు తెలిపారు.

పౌష్టికాహారం ఇవ్వడం లేదు

- ఎంపీడీఓ కార్యాలయం వద్ద బాలింత నిరసన


ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన చేస్తున్న బాలింత, తల్లిదండ్రులు

గోనెగండ్ల: తాను బాలింతను అయినా అంగన్‌వాడీ టీచర్ పౌష్టికాహారం ఇవ్వడం లేదని చిన్నమరివీడు గ్రామానికి చెందిన బండారి తేజ, ఆమె తల్లిదండ్రులు సుశాంతి, బతకన్నలు సోమవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. బాలింత తేజ 23 రోజుల చిన్నారిని ఎత్తుకొని తల్లిదండ్రులతో కలిసి సోమవారం ఎంపీడీఓ కార్యాలయం వద్దకు వచ్చారు. ఎంపీడీఓ మణి మంజరికి తమ సమస్యను వివరించారు. తాను గర్భవతిగా ఉన్నప్పటి నుంచి అంగన్‌వాడీ సెంటర్ నుంచి పౌష్టికాహారం అందడం లేదని ఫిర్యాదు చేశారు. అంగన్‌వాడీ వర్కర్ దురుసుగా మాట్లాడుతున్నారని, తనకు ప్రసవం జరిగి 23 రోజులు అయిన తరువాత కూడా పౌష్టికాహారం ఇవ్వడం లేదన్నారు. తన తల్లిదండ్రులు కూలీ పనులు చేసుకుంటూ పోషిస్తున్నారని చెప్పారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ తెలిపారు.

వాటర్ ఏటీఎంలు.. ఎనీ టైం మూత!

- తుప్పపడుతున్న పరికరాలు
- రూ.9.62 కోట్ల ప్రజాధనం వృథా
- స్పందించని రాష్ట్ర ప్రభుత్వం
- ప్రజలకు అందని శుద్ధ జలం


ఉప్పర్లపల్లి వద్ద నిరుపయోగంగా మారిన మినరల్ వాటర్ మదర్ ప్లాంట్


జి.ఎర్రగుడిలో నిరుపయోగంగా మారిన వాటర్ ఏటీఎం

తుగ్గలి: ప్రజలకు శుద్ధజలం అందించాలనే లక్ష్యంతో గ్రామాల్లో ఏర్పాటు చేసిన వాటర్ ఏటీఎంలు మూతపడ్డాయి. నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారాయి. రాష్ట్ర ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలక ధనం వృథా అవుతోంది. పత్తికొండ నియోజకవర్గంలోని వెల్దుర్తి, కృష్ణగిరి, తుగ్గలి మండలాల్లో రూ.9.62 కోట్లు ఖర్చు చేసి మదర్‌ప్లాంట్లు, ఆర్‌డీ యూనిట్లు ఏర్పాటు చేయాలని 2018 చివర్లో పనులు ప్రారంభించారు. అయితే సకాలంలో పూర్తి చేయలేకపోయారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెండింగ్ పనులు పూర్తిచేసి ప్రజలకు రెండేళ్ల పాటు తక్కువ ధరకు శుద్ధజలం అందించింది. తుగ్గలి మండలంలో ఉప్పర్లపల్లి, కృష్ణగిరి మండలం కంబాలపాడు, వెల్దుర్తిలో మదర్‌ప్లాంట్లు ఏర్పాట్లు చేశారు. ఈ మదర్ ప్లాంట్ల ద్వారా తుగ్గలి మండలంలో 22 గ్రామాలకు కృష్ణగిరి మండలంలో 18 గ్రామాలకు వెల్దుర్తి మండలంలో 21 గ్రామాలకు శుద్ధజలం సరఫరా చేసేవారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆర్‌డీ యూనిట్లలో ప్రజలు ఏటీఎం కార్డుల ద్వారా రూ. 4 చొప్పున చెల్లించి 20 లీటర్ల మినరల్‌వాటర్‌ను తీసుకెళ్లే వారు. రెండేళ్ల పాటు శుద్ధజలం సక్రమంగా సరఫరా చేశారు. అయితే ట్రాక్టర్ల నిర్వహణ బిల్లులు, సిబ్బంది వేతనాలు కాంట్రాక్టర్ సరిగా చెల్లించక పోవడంతో ఆ తర్వాత నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారి పోయింది. ప్రస్తుతం వాటర్ ప్లాంట్లు, వాటర్ ఏటీఎంలలోని పరికరాలు తుప్పు పట్టి పాడైపోతున్నాయి. కోట్లాదిసొమ్ము వృథా అవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. శుద్ధజలం సరఫరా లేక జనం మళ్లీ బోర్లు, కుళాయి నీటిని తాగి ఫ్లోరైడ్ బారిన పడి ఆరోగ్యాలు పాడవుతున్నాయి. పాలకులు, అధికారులు స్పందించి ప్లాంట్లు వినియోగంలోకి తీసుకొచ్చి శుద్ధజలం అందించాలని ప్రజలు కోరుతున్నారు.

బోరు నీటినే తాగుతున్నాం



గ్రామంలో ఏర్పాటు చేసిన వాటర్ ఏటీఎంలు రెండేళ్ల పాటు బాగా పని చేశాయి. ఆ నీళ్లు చాలా బాగుండేవి. అయితే సరఫరా లేక అవి మూతపడి తుప్పు పడుతున్నాయి. బోరు నీరు తాగడంతో ఒళ్లు నొప్పులు వచ్చి వ్యవసాయ పనులు చేసుకోలేక పోతున్నాం. మినరల్ వాటర్ సరఫరా చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. – ఓబులేసు, రామాపురం

వినియోగంలోకి తీసుకురావాలి



గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న వాటర్ ఏటీఎంలను బాగు చేసి వినియోగంలోకి తీసుకురావాలి. నిర్వహణ చేయలేక మినరల్ వాటర్ ప్లాంట్లు మూతపడి అందులో పరికరాలు తుప్పుపట్టాయి. కోట్లాది రూపాయలు వృథా అయ్యాయి. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వాటర్ ఏటీఎంల ద్వారా మినరల్ వాటర్ సరఫరా చేయాలి. – గూటిపల్లి పుష్పావతి, సర్పంచ్, శభాష్‌పురం

శుద్ధజల ప్లాంటును పరిశీలించాం

మూతపడిన శుద్ధజల మదర్ ప్లాంట్‌ను కొన్ని నెలల క్రితమే పరిశీలించాం. ప్రజలను అడిగి సమస్య తీవ్రత తెలుసుకున్నాం. మినరల్ వాటర్ సరఫరాకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాం. ఏమైనా ఆదేశాలు వస్తే ప్లాంటు పునరుద్ధరించి మినరల్ వాటర్ సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతాం. – మహబూబ్‌ఖాన్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, పత్తికొండ